www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 9 ఏప్రిల్ 2025

5

తిరుపతి



నెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లిస్తే 5శాతం తగ్గింపు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను ఈ నెలాఖరు లోపు చెల్లిస్తే 5శాతం తగ్గింపు ఇవ్వనున్నట్లు కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం పన్ను ఈనెల 30లోగా చెల్లించే వారందరికీ 5 శాతం రిబేట్ వర్తించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ నెలాఖరు లోపు చెల్లించిన వారికి 5శాతం తగ్గింపు ఇవ్వనున్నారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సకాలంలో పన్నులు చెల్లించి నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఆ ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చారు.

'మోడల్ టౌన్‌షిప్'గా శెట్టిపల్లి

శ్రీసిటీకి మరో 2500 ఎకరాలు భూసేకరణ
తిరుపతిలో లూలు మాల్, హయత్ ఏర్పాటు
అర్హులందరికీ టిడిఆర్ బాండ్లు పంపిణీ
రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న శెట్టిపల్లిని మోడల్‌టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. అలాగే తిరుపతిలో లూలూమాల్, హయత్ ఏర్పాటు చేస్తామని, అర్హులందరికీ టిడిఆర్ బాండ్లు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. శ్రీసిటీకి మరో 2500 ఎకరాలు రెండో దశలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమని, ఏపిఐఐసి ద్వారా కేటాయింపులు చేసేందుకు కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ చర్యలు తీసుకుంటారని తెలిపారు. త్వరలో అర్హులకు ఇళ్లపట్టాలు ఇస్తామని వెల్లడించారు.

మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో భూ సమస్యపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తర్వాత విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కార దిశగా సమీక్షిస్తున్నామన్నారు. దేశంలోనే మన రాష్ట్రం గ్రోత్ రేట్ నందు రెండవ స్థానంలో ఉండేలా చర్యలు చేపట్టిన అధికార యంత్రాంగానికి, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. శ్రీ సిటీ నందు రెండవ దశ భూ కేటాయింపు 2500 ఎకరాలకు కలెక్టర్, జేసీ కషి చేస్తున్నారు. ఒబెరాయ్ హోటల్ ఏర్పాటుకు ప్రత్యామ్నాయ భూమి కేటాయింపు చేస్తున్నామన్నారు. లూలో మాల్, హయత్ తదితరాలు త్వరలో తిరుపతిలో ఏర్పాటు కానున్నాయి. కూటమి ప్రభుత్వం టూరిజాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి అభివద్ధికి చర్యలు తీసుకుంటోందన్నారు. తిరుపతి జిల్లా పర్యాటక హబ్ గా పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని, తిరుపతి టూరిజం హబ్ గా చేసేందుకు పూర్తి సహకారం ఉంటుందన్నారు. పులికాట్ ముఖ ద్వార పూడికతీతకు 100 కోట్ల రూపాయల నిధులతో పనులు చేపట్టుటకు కట్టుబడి ఉన్నామన్నారు. ముఖ్యమంత్రి చొరవతో తిరుపతి జిల్లాలో 34 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అందుబాటులో రానున్నది. శాప్ చైర్మన్ కషి అభినందనీయం అన్నారు. జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు త్వరలో ఇస్తాం అన్నారు.

నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైన్, సాగరమాల పనులు త్వరలో పూర్తి అయ్యేలా చర్యలు వేగవంతం చేశాం. గత ఆర్థిక సంవత్సరంలో తిరుపతి జిల్లాలో నరేగా కింద పనులు చేపట్టి 165 కోట్ల రూపాయలు వెచ్చించి పురోగతి సాధించడం అభినందనీయం .రానున్న వేసవికి జిల్లాలో తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్రామీణ పట్టణ ప్రాంతాల ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అమరావతి తో పాటు విశాఖపట్నం, రాయలసీమ, తిరుపతి తదితర ప్రాంతాల అభివద్ధికి విజన్ యాక్షన్ ప్లాన్ తో ముందుకు వెళ్తున్నాం అని చెప్పారు. 2047 భవితాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేలా ప్రణాళికలు తయారుచేసి అమలు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఎంఎల్ఏలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహాయాదవ్, మాజీ ఎంఎల్ఏ సుగుణమ్మ పాల్గొన్నారు.

మీడియాతో మంత్రి అనగాని

భారాలు మోయలేం..!

సిపిఎం నిరసన హోరు | కట్టెల పొయ్యే బెటర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

కేంద్రంలోని మోడీ గ్యాస్ ధర పెంచి, వంటింట్లో భారాల మంట పెట్టారని సిపిఎం నేతలు మండిపడ్డారు. వెంటనే పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం వల్ల మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందాన కుటుంబాలపై భారం పెనుభూతంలా పడుతోందన్నారు. జిల్లావ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు హోరెత్తాయి.

తిరుపతిలో... పాత మున్సిపల్ కార్యాలయం వద్ద తలపై గ్యాస్ బండతో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్‌పై 50 రూపాయల భారం వేయడాన్ని సిపిఎం ఖండిస్తోందన్నారు. కార్పొరేట్ ప్రయోజనాల కోసమే గ్యాస్ ధర పెంచారని మండిపడ్డారు. పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలన్నారు. కేంద్రం పెంచిన గ్యాస్ ధరపై సిఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించాలన్నారు. రాష్ట్ర ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి. సుబ్రహ్మణ్యం, ఎన్. మాధవ్, రవి, అక్బర్, రమేష్, రాజు, మురళి, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో...గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరపెంపుతో మోడీ ప్రభుత్వం ఒక్కో కుటుంబంపై 500 భారం మోపిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. విద్యుత్ ఛార్జీలకు గ్యాస్ ధర తోడయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంధం మణి, రెడ్డిపల్లి సురేష్, రమణయ్య, వెంకటేష్, గురునాధం, రాధమ్మ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో.. : సిపిఎం నాయకులు ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. పేదలకు గుదిబండలా నిత్యావసర ధరలు భారమయ్యాయన్నారు. తలపై గ్యాస్ సిలిండర్ పెట్టుకుని 'ఈ భారాలను మోయలేం' అని అన్నారు. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ, పేదలపై భారాలు మోపడం ఏంటని ప్రశ్నించారు. ఎ.విజయ్, కెఆర్ సుబ్రమణ్యం పిళ్లై, యాషన్‌బాష, ఎ.శివ, నాయుడు, రామలింగం, గోవిందస్వామి పాల్గొన్నారు.

రేణిగుంటలో.. తారకరామనగర్ శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో హరినాథ్, సత్యశ్రీ, దీప, రాజశేఖర్, శివానందం, సెల్వరాజ్, ప్రశాంత్, హేమంత్, ప్రభావతి పాల్గొన్నారు.

కెవిబిపురంలో.. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఓ ప్రకటనలో గ్యాస్ ధర పెంపును ఖండించారు.

నాయుడుపేటలో... వెదనపర్తి సుందరరామిరెడ్డి భవన్ సిఐటియు కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు శివకవి ముకుంద ఆధ్వర్యంలో వినూత్నంగా కట్టెలపొయ్యితో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉగాది ఆఫర్‌గా ఆర్థిక సంవత్సరం మొదట్లోనే ప్రజలపై భారాలు మోపిందన్నారు. ఈ కార్యక్రమంలో అక్కరపాక, పుట్టయ్య, వీరయ్య, అంకయ్య, గోపి, వెంకయ్య, చిన్నమ్మ, విజయమ్మ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

టీడీఆర్ కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టాలి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపాలిటీలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించి బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని రెవెన్యూ శాఖామంత్రివర్యులు, తిరుపతి జిల్లా ఇంఛార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్‌కు తిరుపతి టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. తిరుపతికి విచ్చేసిన మంత్రి అనగాని సత్యప్రసాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలిసి ప్రజా సమస్యలపై మంగళవారం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు జి.నర్సింహ యాదవ్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికష్ణ, ఊకా విజయ్‌కుమార్, పులిగోరు మురళీకష్ణారెడ్డి, జె.బి.శ్రీనివాస్, శ్రీధర్ వర్మ, హేమంత్ రాయల్ తదితరులు కలిసి గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని వివరించారు. తొలుత శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ నగరపాలక సంస్థ కార్యాలయంలో 2019-24 మధ్యలో జరిగిన అవినీతిపై విచారణకు ప్రభుత్వం ఆదేశించినా దానిపై నేటికీ ఎలాంటి స్పందన లేదని, తుడా మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా రోడ్లు నిర్మించి నాణ్యత లేకుండా పనులు చేసిన కాంట్రాక్టర్లకు విచారణ పూర్తయిన తర్వాతే బిల్లులు చెల్లించాలని మంత్రిని కోరారు. వీటిపై సమగ్ర విచారణ జరిపించి నష్టపోయిన బాధితులందరికీ న్యాయం చేయాలని విన్నవించారు. మంత్రి అనగాని బదులిస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రతీ ఒక్క బాధితుడికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ సమస్యలనూ ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రస్తావించారు. రేణిగుంటలో వేసవిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌ఏర్పాటు చేయాలని కోరారు. హిందూ శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రాజీవ్‌నగర్ కాలనీలో జరిగిన భూకబ్జాలపై విచారణ జరిపించి పేదలకు పట్టాలు ఇప్పించాలని కోరారు.రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఏప్రిల్ 15న శ్రీకాళహస్తిలో నిర్వహించే జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్లు, మంత్రి అనగాని సత్యప్రసాద్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావులతో కలిసి ఆవిష్కరించారు.

పిఎసి-5 భవనంలో అదనపు ఈవో తనిఖీలు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో నూతనంగా నిర్మిస్తున్న యాత్రికుల వసతి సముదాయం (పీఏసి-5) లో మంగళవారం టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభివద్ధి పనుల పురోగతి గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతన భవనంలో భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. కళ్యాణకట్ట, డైనింగ్ హాల్, లాకర్ల ఏర్పాటు, మరుగుదొడ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు అన్నమయ్య భవన్ లో పీఏసీ-5 నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత విభాగాల అధికారులతో అదనపు ఈవో సమీక్షించారు. డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, హరీంద్రనాథ్, వెంకటయ్య పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరంలో ప్రజలకు వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 17వ వార్డు లో గల దాసరి మఠం, పలణి థియేటర్ సందు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వినియోగంలో లేని బోర్లలోని నీరు తాగడం వలన వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. వినియోగిస్తున్న వాటిని మరమ్మతులు చేయించాలని అన్నారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

తొలగించిన కార్మికులు విధుల్లోకి..

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తొలగించిన కార్మికుల్ని స్విమ్స్ యాజమాన్యం మంగళవారం తిరిగి విధుల్లోకి తీసుకుంది. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సమక్షంలో జరిగిన స్విమ్స్ యాజమాన్యం ,సిమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు), శ్రీ లక్ష్మి వెంకటేశ్వర మాన్ పవర్ కార్పొరేషన్ల మధ్య చర్చలు జరిగాయి. స్విమ్స్ ఆసుపత్రిలో చాలాకాలంగా పనిచేస్తున్న ఆరుగురు కార్మికులను చట్టవిరుద్ధంగా, నోటి మాటతో పని నుండి తొలగించిన ఆరుగురిని బేషరతుగా ఉద్యోగంలో చేర్చుకునేలా ఒప్పందం కుదిరింది. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసులో తమకు న్యాయం జరిగినందుకు డిప్యూటీ కమిషనర్ ఓంకార్ రావు, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, లక్ష్మి శ్రీనివాస మాన్ పవర్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రవికుమార్ కు కార్మికులు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ చర్చల్లో పాల్గొని ఫలితాలను సుగమం చేసిన తిరుపతి జిల్లా సిఐటియు అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం, కార్యదర్శి పి మునిరాజా, స్విమ్స్ నాయకులు సూరి, రవి, మారి ముత్తు లకు ధన్యవాదాలు తెలిపారు.

చంద్రగిరి పంచాయతీ ఈవోపై ఏసీబీ దాడులు

పలుచోట్ల మూడు బృందాల తనిఖీలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

చంద్రగిరి పంచాయతీ ఈవో మహేశ్వరయ్య ఇంటిపై ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. మహేశ్వరయ్య పై అక్రమ ఆస్తుల ఆరోపణలతో ఏకకాలంలో తిరుపతి, బద్వేల్, బంగారుపాళెంలో ఏసిబి సోదాలు ఉదయం నుంచి బద్వేల్ లోని అత్త ఇంట్లో, స్వగ్రామం బంగారుపాళెం మండలం గంగవరంలో, తిరుపతి రూరల్‌లో 3 బృందాలు తనిఖీలు నిర్వహించాయి. అధికారిక లెక్కల ప్రకారం రూ.3.18 కోట్లు ఆస్తులు గుర్తింపు, రూ. 50 కోట్లకు పైగా మార్కెట్ విలువ ఉంటుందని అంచనా. విలువైన డాక్యుమెంట్లు, బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. మూడు ప్రాంతాల్లోనూ ఇంకా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తిరుపతి రూరల్ పేరూరు జర్నలిస్టు కాలనీలోని ఆయన నివాసంలో పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా లంచం తీసుకుంటూ ఈవో మహేశ్వరయ్య ఏసిబి ట్రాప్ కు చిక్కి సస్పెండ్ అయ్యారు. మార్కెట్ విలువ ప్రకారం రూ.30 కోట్లు అక్రమ ఆస్తుల కూడబెట్టినట్లు సమాచారం.

అధ్యక్ష,కార్యదర్శులుగా విద్యా సాగర్, మురళి

ముగిసిన పోస్టల్ రాష్ట్ర మహా సభలు
15 మందితో నూతన కమిటీ ఎన్నిక
మే 20న సమ్మె విజయవంతానికి సిద్ధం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి వేదికగా గత మూడు రోజులుగా జరిగిన అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పోస్టుమేన్, ఎమ్.టి.ఎస్ రాష్ట్ర శాఖ మహాసభలు మంగళవారంతో విజయవంతంగా ముగిశాయి. తపాలా శాఖను కార్పొరేటీకరణ చేసేందుకు మోడీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టడానికి రాష్ట్రంలో ఉన్న తపాలా ఉద్యోగులంతా సిద్ధంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. మే నెలలో జరగనున్న నిరవధిక సమ్మెను సైతం విజయవంతం చేయడానికి సిద్ధం కావాలని సంఘం జాతీయ కార్యదర్శి ఆర్.పి.సారంగ్ కోరారు. పోస్టుమేన్ లను తపాలా శాఖ నుండి దూరంగా ఉంచేందుకు ఐడీసిల ఏర్పాటు పేరుతో జరుగుతున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోస్టుమేన్, ఎమ్.టి.ఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. చివరిగా రాబోయే రెండేళ్ల కాలానికి 15 మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పోస్టుమేన్ అండ్ ఎమ్.టి.ఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా సిహెచ్. విద్యాసాగర్, కె.మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి 300 మంది ఉద్యోగులు ప్రతినిధులుగా, పరిశీలకులుగా పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై...
సిఎండితో చర్చలు సానుకూలం : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై సిఎండి సంతోషరావుతో చర్చలు సానుకూలంగా జరిగాయని ఎస్‌పిడిసిఎల్ గౌరవాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో తెలిపారు.గత 15 రోజులుగా ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి రిలేదీక్షలు చేస్తున్న విషయం విదితమే. సోమవారం భారీ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు సిఎండితో చర్చలు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై యూనియన్, సిఐటియు నేతలతో సంయుక్తంగా



సిఎండి సంతోష్‌రావు చర్చలు జరిపారు. సానుకూల నిర్ణయాలు చేపట్టిన నేపథ్యంలో బుధవారం ఉదయం అధికారుల సమక్షంలో రిలే దీక్షలు ముగించనున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చర్చలలో యూనియన్ రీజినల్ కార్యదర్శి శివప్రసాద్ రెడ్డి, నేతలు మురళి, రవికుమార్ , జలీల్ భాషా , హుస్సేన్ పీర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డయితే నాకేంటి... ఇది నా'అడ్డా'..!

ఎవరూ రావడానికి వీల్లేదు
తుడా చిరుద్యోగి నిర్వాకం
గేటు పెట్టి అడ్డుకుంటున్న తీరు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'ఆక్రమణలకు కాదేది అనర్హం' అనుకున్నట్లున్నారు.. ఏకంగా రోడ్డుకు అడ్డంగా గేటు పెట్టేసి ఎవరూ వెళ్లడానికి వీల్లేదంటూ తుడాలో చిరుద్యోగి వ్యవహరిస్తున్న తీరు స్థానికులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. రెవెన్యూను గుప్పెట్లో పెట్టుకుని బూర్జువా రాజకీయ నాయకులు కబ్జాకు పాల్పడుతూ కోట్ల విలువ చేసే స్థలాలను వెనకేసుకుంటూ ఉంటారు. అయితే తుడాలో పనిచేసే ఓ సీనియర్ అసిస్టెంట్ రాచశ్రీదేవి ఏకంగా రోడ్డును ఆక్రమించుకుని అడ్డంగా గేటు పెట్టుకుని బాధితులను ఉడకాడిస్తున్నారు. బాధితులు అనేకమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. పక్కా 'ప్లాన్'తోనే కార్పొరేషన్, తుడాలోని ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు లేకపోలేదు. గతంలో పిజిఆర్ఎస్ కార్యక్రమంలోనూ బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు పిలిపించి మాట్లాడగా కోర్టులో కేసు ఉందని, కోర్టులోనే తేల్చుకుంటామని ఆమె చెప్పడం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగిగా, అందులోనూ తుడాలో పనిచేస్తున్న రాచ శ్రీదేవి ఈ విధంగా రోడ్డును కబ్జా చేయడంపై చుట్టుపక్కలవారు ప్రశ్నిస్తున్నారు. కమిషనర్ మౌర్య స్పందించి కబ్జాను అడ్డుకోకుంటే, మంత్రి నారా లోకేష్‌ను కలవనున్నట్లు బాధితులు పేర్కొన్నారు. ఈ విషయమై కమిషనర్ దృష్టికి 'ప్రజాశక్తి' తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

డాక్యుమెంట్లలో రోడ్డనే ఉంది : ఎ.వేణుగోపాల్, బాధితుడు

తుడాలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాచా శ్రీదేవి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీకృష్ణనగర్‌లోని ఇంటి ముందు రోడ్డును ఆక్రమించుకున్నారు. పది అడుగుల వెడల్పు, ఇరవై రెండున్నర అడుగుల పొడవుండే రోడ్డు భాగాన్ని ఆక్రమించుకుని ఇతరులెవరూ ప్రవేశించకుండా ఇనుప గేటు పెట్టారు. మా స్థలం నుంచి రోడ్డులోకి వెళ్లడానికి వీల్లేకుండా ఉంది. ధనలక్ష్మి కి చెందిన దాదాపు 14 సెంట్ల స్థలాన్ని 1997లో నాలుగు ప్లాట్లుగా విభజించి, ఉత్తరం వైపు పది అడుగుల వెడల్పుండే స్థలాన్ని రోడ్డుకింద చూపించారు. ఈ స్థలాన్ని కొనుక్కున్న శ్రీదేవి సహా మిగతా ముగ్గురి డాక్యుమెంట్లలోనూ ఉత్తరం దిక్కున పదిఅడుగుల రోడ్డుకు వదిలినట్టు స్పష్టంగా ఉంది. మున్సిపల్ అధికారులు వేణుగోపాల్ కు 2021లో ఇచ్చిన వేకెంట్ ల్యాండ్ టాక్స్ నోటీసులోనూ పదిఅడుగుల రోడ్డు ఉన్నట్టు స్పష్టంగా ఉంది. అయితే, ఈ స్థలానికి తూర్పున చివరి ప్లాటులో ఉన్న రాచా శ్రీదేవి ఆ రోడ్డును ఆక్రమించి, ఆ రోడ్డులోకి ఎవరూ ప్రవేశించకుండా ఇనుప గేటును పెట్టేసింది. ఒక సారి రోడ్డు కింద స్థలాన్ని వదిలాక, అది మున్సిపల్ కార్పొరేషన్ స్వంతమవుతుంది. ఎవరైనా వాడుకునే హక్కు ఉంటుంది. ఈ నాలుగు ప్లాట్లకు తూర్పు సరిహద్దున ఉన్న నన్ను ఈ రోడ్డులోకి ప్రవేశించనీయకుండా శ్రీదేవి అటాంకాలు కల్పిస్తోంది. ఆక్రమించిన రోడ్డులో నీటి సంప్, లెట్రిన్ పిట్ తవ్వుకుని, మోటార్ పెట్టుకుని, వాహనాల పార్కింగ్‌గా ఉపయోగించుకుంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజి రావడంతో లెట్రిన్ పిట్ ను మూసేసి, నీటి సంప్ ను తన వరండాలోకి మార్చుకుంది. మున్నిసల్ కారొపరేషన్ వారు ఏడాది క్రితం ఈ ప్లాట్ల ముందర సిమెంటు రోడ్డు వేస్తున్నప్పుడు, తాను ఆక్రమించిన రోడ్డు భాగంలో సిమెంటు రోడ్డు వేయకుండా అడ్డుకుంది. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు శ్రీదేవి ఆక్రమణలో ఉన్న రోడ్డును విడిపించి, తన ప్లాటుకు రోడ్డు సౌకర్యం కల్పించాల్సి ఉంది. గత ఇరవై ఎనిమిదేళ్ళుగా రోడ్డును ఆక్రమించిన శ్రీదేవి పైన చర్యతీసుకోవాలి.

శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో 'గ్రాడ్యుయేషన్ వేడుక'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి స్థానిక బైరాగిపట్టెడలోని శ్రీ చైతన్య ఐపిఎల్ బ్రాంచ్ లో మంగళవారం ప్రిన్సిపల్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులను పై తరగతులకు ప్రమోట్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల నత్య ప్రదర్శనలు చూపరులను కట్టిపడేసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ఏ ఆర్ రెడ్డి (చిల్డ్రన్ స్పెషలిస్ట్, శ్వేత హాస్పిటల్) పై తరగతులకు ప్రమోట్ అవుతున్నందున విద్యార్థులను అభినందించారు. మరో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏజీఎం సురేష్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నపూర్ణ, ఏవో రవి బాబు, ప్రైమరీ ఇన్చార్జి వనిత, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ మంజుల పాల్గొన్నారు.

గడ్డి పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: వేసవి ప్రారంభమైన నేపథ్యంలో పశువుల దాణాకు కొరత లేకుండా గడ్డి పెంపకం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం పశువైద్యాధికారి డాక్టర్ ముని రాజా మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గడ్డి పెంపకం కోసం పశువులు ఉన్నవారికి, లేని వారికి కూడా సొంత భూమి ఉండాలన్నారు. 10 సెంట్లు నుంచి 50 సెంట్లు లోపు రైతులు గడ్డి పెంపకాన్ని ప్రారంభించుకోవచ్చన్నారు. ఇందుకు గాను ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూర వుతాయన్నారు. 10 సెంట్ల భూమిలో గడ్డి పెంపకానికి ఏడాదికి 6598 రూపాయలు, 50 సెంట్లు భూమిలో గడ్డి పెంపకానికి 32992 రూపాయలు మంజూరు అవుతుందని ఆయన వివరించారు. ఈ నిధులు గడ్డి సాగును అనుసరించి మూడు విడతల్లో రైతులకు ఖాతాల్లోకి జమ చేస్తానరి తెలిపారు. ఇందుకుగాను భూమికి సంబంధించిన 1బి అడంగల్, ఆధార్ కార్డు, రైతు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అన్ని వసతులతో గోవిందధామం నిర్మిస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) చంద్రగిరిలో అన్ని వసతులతో గోవిందధామం నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మంగళవారం మండలంలోని చంద్రగిరి – శ్రీనివాస మంగాపురం రహదారి పక్కన గోవిందధామం నిర్మాణానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌తో కలసి భూమి పూజ నిర్వహించారు. గోవింద ధామం నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చంద్రగిరి మహాప్రస్థానం సేవా సమితి" కూడా ఏర్పాటు చేశామని, విరాళాలు ఇవ్వదలుచుకున్నవారు బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ నెంబర్: 573420110000307, ఐఎఫ్ఎస్సి కోడ్ – బి కే ఐ డి 0005734 చంద్రగిరి బ్రాంచ్, పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఎస్ గౌస్ బాషా, బాలకృష్ణ, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, సక్కూరి ధనుంజయ రెడ్డి, హేమంబరధరరావు, లోకాద్రి నాయుడు, దోమలపాటి సతీష్, శివ కోటిరెడ్డి, మంగాపురం భాస్కర్, స్థలదాత రామచంద్ర రెడ్డి, సర్పంచ్ ముది కుప్పం రూపా రామ్మూర్తి, రమేష్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి మురళి, కొత్తపల్లి సునీత, తహసిల్దార్ శివరాం సుబ్బయ్య, ఎంపీడీవో వెంకటాద్రి నాయుడు, కూటమి పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

తహశీల్దారు శ్రీదేవిని అభినందిస్తున్న సర్పంచ్ తదితరులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలం తాహశీల్దారుగా బాధ్యత చేపట్టిన శ్రీదేవిని జనసేన మండల అధ్యక్షుడు భాష, కొత్తపాలెం పంచాయతీ సర్పంచ్ హరిప్రసాద్‌లు మంగళవారం ఆమె కార్యాలయంలో కలిసి సన్మానించారు. వారు మండలంలో భూమి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, పరిష్కరించాలని తహశీల్దారును కోరారు. ఈ కార్యక్రమంలో పార్లపల్లి సర్పంచ్ చలపతి, జనసేన నాయకులు భాస్కర్, బాలాజీ, ఢిల్లీ, హరిబాబు, మురళి, గురవయ్య, లీల కుమార్, రవి కుమార్ హరీష్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వి. చెంగయ్య

ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్ : మంగళవారం చెవిరెడ్డిపల్లిలో ఆశా వర్కర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డీపల్లి చెంగయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 12వ తేదీ తిరుపతిలో జరుగు సమావేశంలో ఆశ వర్కర్లు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ 20 సంవత్సరాల కాలంలో ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం వి రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్వీయూలో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ వృక్ష శాస్త్ర విభాగం, పారంపర్య వైద్య మహాసంఘం సంయుక్తంగా "సాంప్రదాయ ఔషధం– ఆధునిక, సహజ చికిత్సల ఏకీకృత విధానం" అనే అంశంపై ఏప్రిల్ 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు అంతర్జాతీ సదస్సును నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు ఆచార్య జె. కామాక్షమ్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వివిధ దేశాల, రాష్ట్రాల పశోధకులు పారంపర్య వైద్య నిపుణులు దాదాపు 400 మంది పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రకాల స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన నోటు పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. జడ్ పి హై స్కూల్ ప్లస్ విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఒక్కో విద్యార్థికి 12 నోటు పుస్తకాలు చొప్పున పంపిణీ చేశారు. త్వరలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కె. వి. హాస్పిటల్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, కెవి హాస్పిటల్ ఒకటో వార్షికోత్సవ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో హాస్పిటల్ అధినేత నారా గోపాల్, డాక్టర్ త్రివిక్రమ్ రేచర్ల , డాక్టర్ కీర్తి నారాలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఫౌండర్ నారా గోపాల్ ఎంతోమందికి ఆదర్శనీయుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బండి ధనుంజయ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ యమహా సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు రామ్మోహన్ రావు, పయ్యావుల మురళి నాయుడు, సుధీర్, శివకుమార్ రెడ్డి కోట వెంకటేశ్వర్లు, రాము, పిల్లెల శీను, కె .ఆర్. ఎం, కృష్ణారెడ్డి ముని ప్రసాద్, వెంకటేశ్వర్లు నారాయణ ఎగ్గిరెడ్డి విజయకుమార్, మల్లి తోట విజయ్ కుమార్ నాగేంద్ర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పురమిత్ర యాప్‌తో మున్సిపల్ సేవలు పొందండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు మునిసిపల్ సేవలు పొందవచ్చునని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు కార్యాలయాలు చుట్టూ తిరిగే పనిలేకుండా మున్సిపల్ సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను రూపొందించిందన్నారు. ఈ యాప్‌లో ఒక ఫోటోతో, చాట్ బాట్ నుంచి వాయిస్ ద్వారా పిర్యాదు చేయవచ్చున్నారు. ఈ యాప్ ను డౌన్ లోడ్ చేసుకొని నగరపాలక సేవలు పొందాలని ఆమె కోరారు.

20న హాథీరాంజీ మఠంపై తుది నిర్ణయం

మంత్రి పర్యటనలో చర్చకు...

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) తిరుపతి, శ్రీ స్వామి హాథీరాం బావాజీ మఠం భవనానికి సంబంధించి ఈనెల 20వ తేదీలోపు తుది నిర్ణయాన్ని తీసుకోనున్నట్లు జిల్లా ఇన్చార్జ్ మంత్రి, రెవిన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్య ప్రసాద్ నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా అధికారులతో కలెక్టరేట్లో సమావేశమైన సందర్భంగా ఈ మేరకు చర్చ జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 100 ఏళ్లకు పైబడిన తిరుపతి గాంధీ రోడ్డు మార్గంలోని శ్రీ స్వామి హాథీ రాంజీ భవనం శిధిలావస్థకు చేరిందన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సరైన సమయంలో సరైన నిర్ణయాన్ని తీసుకో కపోతే పెద్ద ప్రమాదమే జరిగే అవకాశం ఉందని, ప్రాణాలు పోకముందే శిధిలావస్థకు చేరిన మఠం మండువా భవనం పై సమన్వయ సమావేశాన్ని నిర్వహించి నిర్ణయాన్ని ప్రకటించాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. మఠం శిథిలావస్థకు చేరలేదని, దీని చుట్టూ ఉన్న వ్యాపారులు

మఠం కూల్చివేస్తే వీధిన పడతారని రాజకీయంగా ఇటు మఠం అధికారులకు, అటు ప్రభుత్వ పెద్దలకు ఇటీవల వినతులు వెళ్లాయి. సీఎం నారా చంద్రబాబు నాయుడు తిరుపతి పర్యటనకు వచ్చినప్పుడు మఠానికి సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఇదివరకే జిల్లా కలెక్టర్‌కు సూచించినట్లు విశ్వసనీయ సమాచారం.

మఠంపై రాజకీయ నీలి నీడలు..

మఠం పరిపాలన వ్యవహారంలో గతంలోకూడా రాజకీయ ప్రవేశం జరిగి పరిపాలన అస్తవ్యస్తంగా మారిపోయింది. మఠానికి సంబంధించిన భూములు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న అన్యాక్రాంతాన్ని మాత్రం అడ్డుకున్న దాఖలాలు లేవని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా కొందరు మఠం భూములను కైవసం చేసుకోవడానికి రాజకీయంగా ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. మరోవైపు శిథిలావస్థకు చేరిన మఠం మండువ భవనం కూల్చివేతపై కూడా కొన్ని నెలలుగా రాజకీయంగా ఒత్తిడిలు తీసుకువస్తూ కూల్చివేతను పొడిగించుకుంటూ వస్తున్నట్లు తెలుస్తోంది. రాజకీయ ప్రాధాన్యత ఇస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని గ్రహించిన ప్రభుత్వం మఠం వాస్తవ పరిస్థితిని సమీక్షించి తుది నిర్ణయాన్ని తీసుకోవడానికి సంసిద్ధమైంది. ఈనెల 20వ తేదీ జరగనున్న సమావేశంలో ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచి చూడాలి.

రెవెన్యూ అధికారుల ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి - ఓజిలి : ప్రభుత్వ భూముల కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. రెవెన్యూ శాఖ అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ కొంతమంది ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారు. మండల పరిధిలోని బట్లకనూపూరులో సర్వే నెంబర్ 103 లో సుమారు 160 ఎకరాల అటవీ పోరంబోకు భూములు ఉన్నాయి. అందులో కొంతమంది అటవీ పోరంబోకు భూముల్లోకి ప్రవేశించి 5 ఎకరాల వరకు చదును చేయడంతో కొంతమంది స్థానికులు రెవెన్యూ కార్యాలయానికి సమాచారం తెలియజేశారు. దీంతో తహసీల్దారు పద్మావతి స్పందించి ఆర్ఐ విజయ్ కుమార్, వీఆర్వో డిల్లేయ్య ఆక్రమణకు గురైన భూముల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. మళ్లీ భూ ఆక్రమణదారులు మంగళవారం రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించి భూముల్లోకి ప్రవేశించడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అటవీ పోరంబోకు భూముల్లో ప్రవేశించకుండా రెవెన్యూ శాఖ నిఘా ఏర్పాటు చేశామని రెవెన్యూ శాఖ అధికారులు తెలియజేశారు.

రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త.. పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్ : వెంకటగిరి మున్సిపాలిటీ పరిధి, ఒకటో వార్డు, ఏరియా రోడ్డు ప్రక్కనే చెత్తదిబ్బలు పేరుకుపోయి ఉన్నాయి. ఈ చెత్త గుట్టలకి పక్కనే నివాసిత ఇండ్లు ఉన్నాయి. గాలి వీచినప్పుడు దుర్వాసనకి అక్కడ నివాసాలు ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త పేరుకుపోవడంతో దుమలు వృద్ధి చెరంది స్థానికులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. మెయిన్ రోడ్డు పక్కనే ఈ విధంగా అపరిశుభ్రంగా ఉంటుంటే మారుమూల వీధులలో పారిశుధ్యం ఎంత అపరిశుభ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శలు వస్తున్నాయి. పారిశుధ్యం అధ్వాన్నంగా ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారుల్లో చలనం లేదు. ఇకనైనా చెత్త దిబ్బలు తొలగించి వెంకటగిరి మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు వేసవి సెలవల్లో కాలేజీలకు వెళ్లాలి

నాయుడుపేట ఎంఈఓ బి.మునిరత్నం

ప్రజాశక్తి - నాయుడుపేట: పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ సెలవు దినాలను వృధా చేయకుండా కాలేజీలకు వెళ్లేటట్లు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని నాయుడుపేట ఎంఈఓ బి.మునిరత్నం మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఒక మంచి అవకాశం కల్పించిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని పరీక్షా ఫలితాలతో సంబంధం లేకుండా పదవ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులకు కాలేజీపై శ్రద్ధ కలిగేలా ఇంటర్ కాలేజీకి వెళ్లి చదువుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. ప్రతి ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో 20 రోజులపాటు ముందస్తు క్లాసులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మీకు ఇష్టమైన సబ్జెక్టులో చేరవచ్చునని పరీక్ష ఫలితాలు వెలువడ్డాక మీకు కావాల్సిన కాలేజీలో చేరవచ్చునని విద్యార్థులకు తెలిపారు.

డాక్టరేట్ గ్రహీత మల్లీశ్వరికి ఎమ్మెల్యే ఆదిమూలం సత్కారం

ప్రజాశక్తి -పిచ్చా టూరు: పిచ్చాటూరు జడ్పీ హైస్కూల్ హిందీ పండిట్, డాక్టరేట్ గ్రహీత డాక్టర్ రాయల్ మల్లీశ్వరిని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం ఘనంగా సత్కరించారు. డాక్టర్ మల్లేశ్వరి ఆధ్యాత్మిక(ధ్యానం), సామాజిక సేవా కార్యక్రమాలలో విశిష్ట సేవలు అందించినందుకు గత నెల డాక్టరేట్ పట్టా, కలాం లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు అందుకోవడంతో పాటు పలు అవార్డులను సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు పద్దు రాజు, బంగాళ జయచంద్ర నాయుడు, రమేష్, డిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

యస్వీయు సైన్స్ కళాశాల రికార్డు అసిస్టెంట్ ప్రదీప్ మృతి


ప్రదీప్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు సైన్స్ కళాశాలలో ప్రిన్సిపల్ ఆఫీసులో పనిచేసే రికార్డ్ అసిస్టెంట్ ఎస్ ప్రదీప్ కుమార్ గురువారం టాటా క్యాన్సర్ హాస్పిటల్‌లో మృతి చెందారు. ఎంఆర్ పల్లి నివాసి అయిన ప్రదీప్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత 20 సంవత్సరాలకు పైగా ఎస్వీయూలో పలు విభాగాలలో పని చేస్తూ సౌమ్యుడిగా అందరికీ సుపరిచితులు. 15 రోజుల క్రితం అనారోగ్యంతో సిమ్స్ హాస్పిటల్‌ని సంప్రదించగా వైద్యులు లివర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ టాటా క్యాన్సర్ హాస్పిటల్‌కి రెఫర్ చేశారు. అక్కడ లివర్ కేన్సర్ 4వ దశ దాటిందని డాక్టర్లు తెలిపారు. పరిస్థితి చెయ్యిదాటిపోవడంతో ఆయన మృతి చెందారు. ప్రదీప్ ముదిపట్ల ఎస్వీయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పద్మావతి, విసి, రిజిస్ట్రార్‌లు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వేరుశెనగ, నువ్వుల క్షేత్ర దినోత్సవం

ప్రజాశక్తి - పిచ్చాటూరు : రాస్ కే.వి.కే, కరకంబాడి జాతీయ ఆహార భద్రతా మిషన్ వారి సహకారంతో నూనె గింజల ఆదర్శ గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రత్యేక సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శ నా క్షేత్రాల కింద పిచ్చాటూరు మండలంలోని అప్పంబట్టు, కారూరు గ్రామాలలో మంగళవారం నిర్వహించిన వేరుశెనగ నువ్వుల క్షేత్ర దినోత్సవం నిర్వహించినట్లు కే.వి.కే హెడ్ డా.ఎస్. శ్రీనివాసులు తెలిపారు. మండల వ్యవసాయాధికారి సంజీవ రెడ్డి, కెవికె శాస్త్రవేత్తలు దివ్య, రాము కుమార్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు వేరుశెనగ, నువ్వుల సాగుపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కే.వి.కే హెడ్ డా.ఎస్.శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి సంజీవ రెడ్డి, కే.వి.కే శాస్త్రవేత్తలు డా.వి.దివ్య, రాము కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు, 90 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి

తిరుపతి సిటి : ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని తిరుపతి అంబేద్కర్ భవనం కమిటీ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం సభ్యులు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లును, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వపరంగానే అధికారికంగా అంబేద్కర్ జయంతిని ఏప్రిల్ 14 న తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహిస్తామని తెలియజేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో తిరుపతి అంబేద్కర్ భవనం కమిటీ చైర్మన్ పి పరమశివన్, కార్యదర్శి నాగేశ్వరరావు, సభ్యులు గోపి, అంబేద్కర్ స్టార్ కష్ణ పాల్గొన్నారు.

'పవన్‌కల్యాణ్' చిన్నకుమారుడు కోలుకోవాలని..

తిరుపతి సిటి : డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని అలిపిరి పాదాల మండపం వద్ద నగర అధ్యక్షులు రాజారెడ్డి ఆధ్వర్యంలో టెంకాయలు కొట్టారు. బైరాగిపట్టెడ ఆంజనేయస్వామి ఆలయంలో కిరణ్‌రాయల్ ప్రత్యేక పూజలు చేయించారు.

నారాయణలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఏజీఎం శ్రీనివాసులు ఐదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేలా గ్రాడ్యుయేట్ టోపీలను, గోల్డ్ మెడల్స్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, కోఆర్డినేటర్ దాక్షాయణి, ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్చనకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం గ్రంథాలయ శాస్త్రం లో మల్లె మొగ్గల దేవి అర్చనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సీఈ దామ్ల నాయక్ తెలిపారు. ప్రధాన గ్రంథాలయ అధికారి ఆచార్య కొంగర సురేంద్ర బాబు పరివేక్షణలో పరిశోధక సిద్ధాంత గ్రంథమైన "ఇన్ఫర్మేషన్ లిటరసీ స్కిల్స్ అమాంగ్ ది పబ్లిక్ లైబ్రరీ యూజర్స్ ఆఫ్ ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్: ఏ సర్వే" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించి నందుకు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగింది. ఈమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధన వ్యాసాలను ప్రచురించారు.

చిల్లర మాటలు మానుకో జగన్ : పళ్ళెం శ్రీనివాసరావు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జగన్మోహన్ రెడ్డి కడపలో జరిగిన సంఘటనపై సీఎం చంద్రబాబు నాయుడుపై మాట్లాడిన తీరు వీధి రౌడీలా ఉందని, చిల్లర మాటలు మాట్లాడవద్దని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పళ్ళెం శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం తిరుపతి ఆటోనగర్ వద్ద తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఏమాత్రం మారలేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తొత్తుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని జగన్ మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. పోలీసులు చట్ట పరిధిలోనే పనిచేస్తున్నారన్నారు. మే నెలలో మూడు రోజులపాటు కడపలో టీడీపీ రాష్ట్ర మహానాడును ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు. నామినేట్ పదవుల కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. తిరుపతిలో వైసిపి హయంలో టి.డి.ఆర్ బాండ్ల కుంభకోణంపై దర్యాప్తు జరుగుతోందని, అర్హులైన వారందరికీ పిడిఆర్ బాండ్లు ఇస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, శ్రీధర్ వర్మ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-బాలయపల్లి: బాలాయపల్లి మండల కేంద్రంలో ఆశాల జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంపు కోసం భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాల్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మే 20వ తేదీ లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జరుగు దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు యం.వి.రమణ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.గోపమ్మ, సుహాసిని, కృష్ణవేణి, పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే జీవోల రూపంలో అమలు చేయాలని, కనీసం వేతనం 26 వేలు ఇవ్వాలని, వారిని మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్రవ్యాప్తంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు పీహెచ్‌సి పరిధిలో మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా పుత్తూరు మండల అధ్యక్షులు మారెమ్మ, తిరుపతి జిల్లా అధ్యక్షులు హేమలతలు మాట్లాడుతూ ఆశా కార్మికులకు 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని, నాణ్యమైన యూనిఫామ్ ఇవ్వాలని 5 జి సెల్ ఫోన్‌లు ఇవ్వాలని, వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధ సంఘం నాయకులు ధనలక్ష్మి, హరిత, లక్ష్మీ, దీప, నాగజ్యోతి, మనిషా రాధా తదితరులు పాల్గొన్నారు.

సీఎం సెక్రటరీకి వీడ్కోలు

ప్రజాశక్తి- రేణిగుంట : రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటన ముగించుకుని ఆదివారం ఉదయం తిరుగు పయనమైన రాష్ట్ర ముఖ్యమంత్రి సెక్రటరీ కార్తికేయ మిశ్రాకి రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. కలెక్టర్ డా.వెంకటేశ్వర్ ఎస్, శ్రీ కాళహస్తి ఆర్.డి.ఓ. భాను ప్రకాష్ రెడ్డిలు వీడ్కోలు పలికారు. ఏర్పేడు మండలం మాధవమాల ఉడ్ కార్వింగ్ ఆర్టిజాన్ క్లస్టర్ నందు తయారు చేయబడిన శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిమ జ్ఞాపికను, అలాగే శ్రీకాళహస్తి కలంకారి క్లస్టర్‌లోతయారు చేయబడిన కలంకారి క్యాన్వాస్ ను అందించారు. ఉత్తమ హ్యాండీ క్రాఫ్ట్ ఉడ్ కార్వింగ్ అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రపంచ పర్యాటక దినోత్సవం – 2024 సందర్భంగా తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మాధవమాల హ్యాండీ క్రాఫ్ట్ ఉడ్ కార్వింగ్ ఎంపిక కాబడి ముఖ్యమంత్రి వర్యుల చేతుల మీదుగా అవార్డు పొందడం జరిగిందని, అలాగే జిల్లాలోని శ్రీకాళహస్తి కలంకారి క్లస్టర్ వాటి ప్రాశస్త్యాన్ని కలెక్టర్ వివరించారు.

క్రైం న్యూస్

తిరుమలలో వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో చెన్నై నగరానికి చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ నెల 5 తేదీన తరిగొండ వెంగమాంబ అన్నవితరణ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన శీనుషా భోజనం అనంతరం పాదరక్షలు వేసుకొని వస్తానని కుటుంబ సభ్యులకు కనిపించకుండా పోయాడు. ఎంతసేపైనా రాకపోవడంతో పరిసరాల ప్రాంతాల్లో వెతికిన కుటుంబ సభ్యులు కనిపించక పోవడంతో ఆందోళన చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. భక్తుడి ఆచూకీ తెలిసినవారు సమాచారం ఇవ్వాలని కోరారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవ పట్టణ పరిధిలోని ఎగువ వీరారెడ్డి పల్లికి చెందిన బాలిక సాయి జుహీ మంగళవారం ఇంటి నుండి తప్పిపోయిన ఘటన చోటు చేసుకుంది. బాలిక స్థానిక ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. ఈ రోజు పాఠశాలకు పోకుండా, ఇంటి బయట పిల్లలతో ఆడుకుంటూ తప్పిపోయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ సుబ్రమణ్యం రాజు గాలింపు చర్యలు చేపట్టగా బాలిక ఒకటవ పట్టణంలోని ఐస్ క్రీం షాప్ వద్ద ఉన్నట్లు తెలిసింది. పోలీసులు బాలికను క్షేమంగా తెచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. వెంటనే అప్రమత్తమై పాపను కాపాడిన పోలీసులకు పాప తలిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

కానూరు అంగన్వాడీ పిల్లలకు అస్వస్థత

వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, కానూరు రాజుపాలెం గ్రామం, ఎగువ కానూరు అంగనవాడి స్కూలు నందు మంగళవారం మధ్యాహ్నం భోజనానంతరం ఇంటికి వెళ్లిన12 మంది పిల్లలలో ఐదు మందికి మధ్యాహ్నం రెండు గంటలకు వాంతులు కావడంతో, తల్లిదండ్రులు పిల్లలను నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న సిడిపిఓ ఉమామహేశ్వరి ఆసుపత్రికి చేరుకుని డాక్టర్లతో మాట్లాడి పిల్లల ఆరోగ్యం విషయం తెలుసుకున్నారు. పిల్లల విషయంలో ఆందోళన పడవలసిన అవసరం లేదని వైద్యం అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. పిల్లలు కోలుకుంటున్నారని తెలిపారు. ఇది ఫుడ్ పాయిజనా లేక ఇతర ఏ కారణమా అనేది తెలియాల్సి ఉందన్నారు. సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆసుపత్రికి చేరుకొని డాక్టర్లతో సంఘటన విషయంపై చర్చించారు. మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సిఐ సంఘమేశ్వరరావు, ఎస్సై నాగరాజు, నాయుడుపేట ఎస్సై లక్ష్మి, స్థానిక నాయకులు దగ్గరుండి పిల్లల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

IN THE COURT OF PRINCIPAL CIVIL JUDGE(JUNIOR DIVISION),CHITTOOR
I.A.No.517 of 2023
O.S.No. 94 of 2013

Between:-
T.Sivan & another ...Petioners/Plaintiffs
And:-
T.Murugan & Others ...Respondents/ Defendants

NOTICE TO 18TH RESPONDENT

R18. T.KARUNAKARAN,
S/o Late Thiruvengadam,
R/at D.N.1-77B, Varadharaj Nagar,
K.T.Road,Mangala Bhavi,
Tirupati Town and District.

Sir,
Please take notice that the above named Petitioner filed **I.A.No.517 of 2023** in **O.S.No. 94 of 2013** against you to implead the L.Rs of deceased 11th Defendant Tiruvengadam. You be the 18th Proposed Respondent / Defendant in this case and said case is posted to **29-04-2025** for your appearance before the said court. Please be present on the said date at about **10.30 a.m**. either in person or through an advocate and file your objections if any, failing which, the matter will be decided in your absence as exparte.

Sd/-**M.SATHISH KUMAR**
Advocate for Petitioner/Plaintiff,Chittoor

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.P.No.4/2025

మదనంబేటి మురళి ...పిటిషనర్

వర్సెస్

1. వేనాటి వేణుగోపాల్‌రెడ్డి
2. కొటారు రమేష్
3. చెన్నూరు సురేష్‌రెడ్డి
4. వేనాటి దేవేంద్రరెడ్డి
5. మారాబత్తిన రవీంద్రయ్య ...రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

పై నెంబరు ఐ.పి.లో పిటిషనరు తనని దివాలాదారునిగా నిర్ధారించమని కోరుతూ పైన తెలిపిన కోర్టులో డేటార్ ఐ.పి.నెం. 4/2025ను దాఖలు చేసియున్నారు. సదరు ఐ.పి.విషయమై ఎవ్వరికైన ఎటువంటి ఆక్షేపణలు ఉన్నచో అట్టివారు తేది: 17.04.2025న ఉదయం 10:30 గంIIలకు పై కోర్టు నందు వ్యక్తిగతముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షపణలు తెలియజేయవలెను. లేని యెడల ఎటువంటి అభ్యంతరములు లేనట్లుగా మీ పరోక్షముగా తీర్మానించబడును.

ఇట్లు
యస్.కె.నాగూరు, బి.కాం.,ఎల్.ఎల్.బి
పిటిషనరు తరపు న్యాయవాది, గూడూరు

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION): TIRUPATI
E.A.No:161/2022 in O.E.P.NO.102/2019 in O.S.No: 411 / 2015

Mittapalli Syamsundar Reddy ...Claim Petitioner
Vs.
B.Sumathi & another ...Respondents

Notice to Respondent No: 2

R2. M.Munikrishna Reddy, S/o late M.Krishna Reddy, Durgasamudram Village & Post, Tirupati Rural Mandal, Tirupati District.

Please take Notice that the claim petition filed the above petition to raise attachment in the above execution petition and the above matter stands posted to 21/4/2025 for your appearance. If you fail to appear in person or through an advocate and file your objections if any on the said date at 10-30 am., the matter will be decided in ex-parte.

M.NAGARAJU
Advocate, Tirupati.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION): TIRUPATI
E.A.No:162/2022 in O.E.P.NO.102/2019 in O.S.No: 411 / 2015

Mittapalli Syamsundar Reddy ...Claim Petitioner
Vs.
B.Sumathi & another ...Respondents

Notice to Respondent No: 2

R2. M.Munikrishna Reddy, S/o late M.Krishna Reddy, Durgasamudram Village & Post, Tirupati Rural Mandal, Tirupati District.

Please take Notice that the claim petition filed the above petition for stay of above execution petition and the above matter stands posted to 21/4/2025 for your appearance. If you fail to appear in person or through an advocate and file your objections if any on the said date at 10-30 am., the matter will be decided in ex-parte.

M.NAGARAJU
Advocate, Tirupati.

Before the Hon'ble District Consumer Redressal Commission-II, Tirupati
CC.No.65/2024

P.Lakshmi W/o Late Pavan Kumar
D.No.10-1-9, Akuthota Street, Tirupati ...Petitioner/Complainant
V/s
The Branch Manager, State Bank of India, Rly Kodur Branch, YSR Kadapa District & another ...Respondents/Opposite Partys

NOTICE RESPONDENT NO.2

R2) Parnam Sasikala W/o Late Subbarayudu. D.No.20-3-18/2A, Sivajyothi Nagar, Tirupati Town & Mandal, District.

మీ యొక్క హాజరు నిమిత్తం కోర్టువారు తేది. 21.04.2025 వాయిదా వేసియున్నారు. సదరు తేదీన ఉదయం 10.30 గంIIలకు నేరులోగాని లేక వకీలు ద్వారా హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేనియెడల పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది **21.04.2025**
పి.లక్ష్మి, పిటీషనర్, తిరుపతి

IN THE COURT OF I ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: TIRUPATI
I.A.No.153 OF 2023
I.A.No.669 OF 2017
O.S.No.318 OF 2017

K. Sankar Reddy (died) & others ...Petitioners/Plaintiffs
Vs
T. Ramamurthy & others ...Respondents/Defendants

I.A. NOTICE TO THE RESPONDENTS/ DEFENDANTS No.11 & 12

To
11. V. Prameela, S/o Late P. Raja reddy,
12. P.Anil Kumar, S/o Late P.Raja reddy,
Both are residing at D.No.20-1-287/A, Korlagunta, Tirupati.

Please take notice in the I.A. No.153/2023 in I.A.No.669/2017 in O.S.No.318/2017 and in the above I.A., it is posted to 30.04.2025 for your appearance and you have to appear before the said court on that day, either by yourself or through your advocate at about 10.30 a.m. or else you will be set exparte and the case will be proceeded in your absence.

Date of hearing: 30.04.2025
M.VANI,
P. MURALIKRISHNA REDDY,
Advocates, Tirupati.

నరసింహ యాదవ్‌కు సత్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన గొల్ల నరసింహ యాదవ్ ను తిరుపతి పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షులు తక్కలపాటి ప్రకాష్ నాయుడు, తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అత్తిరాల భాస్కర్ గౌడ్, నీలవర్ణం యాదవ్, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియాపై అవగాహన

ప్రజాశక్తి - బాలయపల్లి : బాలాయపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగ్యూ, మలేరియా వ్యాధులపై ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను పరిసరాల శుభ్రతపై అప్రమత్తం చేయాలని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పనిలో ఉపశమనం పొదుతూ, ఎక్కువ నీరు తీసుకోవాలని, డాక్టర్ లికిత, డాక్టర్ లియానాలు సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఇఓ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన ఎస్. గణేష్ నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్యేని గజమాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, టిడిపి నాయకులు ఎలుమలై అమ్ములు, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు కరుణాకరన్, బిఆర్ యుగంధర్. బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు షణ్ముగం రెడ్డి, మైనారిటీ నాయకులు, వడమాల పేట, నింద్ర విజయపురం టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థుల ఇంటర్న్ షిప్ సమాపన సమారోహం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని యోగ విభాగం విద్యార్థులు శ్రీవెంకటేశ్వర ఆయుర్వేద కళాశాలతో పరస్పర అవగాహన ఒప్పందం చేసుకున్న యోగా, ఆయుర్వేద విద్యార్థుల రెండు నెలల ఇంటర్న్ షిప్ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రేణు దీక్షిత్ విచ్చేసి యోగ శాస్త్రం, ఆయుర్వేద శాస్త్రం సంస్కృతంలో వర్ణింపబడ్డాయని, ఈ విషయాలపై పరస్పర మల్టీ డిస్సినరీ రీసెర్చ్, స్టడీస్ చేసినట్లయితే చక్కటి చికిత్సను ఆధునిక రోగాలకు అందించడం సులభం అవుతుందని అన్నారు. విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి యోగ విభాగం విద్యార్థులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద కళాశాల ప్రొఫెసర్ విజయభాస్కర్ రెడ్డి, యోగ విభాగం హెచ్.ఓ.డి డా.తపన్ కుమార్ గడై, యోగ విభాగం అధ్యాపకులు డా.ఆర్. లక్ష్మీనారాయణ, డా.టి. శివకుమార్, డా.కె.సి.ఎస్ లోకేశ్వర్, యోగ విభాగ ఎమ్.ఎస్.సి ఇంటర్న్ షిప్ విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశ్రామికంగా మహిళలు అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి -దొరవారిసత్రం :పొదుపు సంఘాలలో సభ్యులుగా ఉన్నవారు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని తిరుపతి జిల్లా వెలుగు ప్రాజెక్ట్ అదనపు పిడి ప్రభావతి సూచించారు.మంగళవారం ఆమె దొరవారిసత్రం మండలంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వార్షిక రుణం, జీవనోపాధి, పారిశ్రామిక ఉత్పత్తుల తయారీ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జీవనోపాదుల జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ధనంజయ రెడ్డి, ఉన్నతి డిపిఎం విజయ్ కుమార్,ఏపిఎం మునిరాజా ,సీసీలుమణెమ్మ, ధనమ్మ, వివోఏలావణ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి

శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు

ప్రజాశక్తి - తిరుమల :తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 10 నుండి 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు సాలకట్ల వసంతోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. ఏప్రిల్ 10వ తేదీన ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారు నాలుగు మాడవీధులలో ఊరేగుతారు. అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఇక్కడ వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంటారు. రెండవరోజు ఏప్రిల్ 11న శ్రీ భూ సమేత శ్రీ మలయప్పస్వామివారు ఉదయం 8 నుండి 10 గంటల వరకు బంగారు రథాన్ని అధిరోహించి తిరుమాడ వీధులలో ఊరేగుతారు. అనంతరం వసంత మండపంలో అర్చకులు వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. చివరిరోజు ఏప్రిల్ 12న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారితో పాటుగా శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవర్లు, శ్రీ రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి సాయంకాలానికి ఆలయానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారు. కాగా ప్రతి రోజు సాయంత్రం 6 నుండి 6.30 గంటల వరకు ఆస్థానం ఘనంగా నిర్వహిస్తారు. వసంత ఋతువులో శ్రీ మలయప్పస్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఈ క్రతువులో సుగంధ పుష్పాలను స్వామికి సమర్పించటమే కాక వివిధ ఫలాలను కూడా నివేదించడం ఈ వసంతోత్సవంలో ప్రధాన ప్రక్రియ. వసంతోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 10న తిరుప్పావడ సేవ, ఏప్రిల్ 10 నుండి 12వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ చైర్మన్‌గా జిఎస్.ప్రసాద్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : పబ్లిక్ రిలేషన్స్ సొసైటి ఆఫ్ ఇండియా (పిఆర్ఎస్ఐ) తిరుపతి ఛాప్టర్ చైర్మన్‌గా డాక్టర్ జిఎస్.ప్రసాద్ ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన పిఆర్ఎస్ఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో రెండేళ్ల కాలపరిమితితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చాప్టర్ ముఖ్య సలహాదారులుగా టిటిడి చీఫ్ పిఆర్వో డాక్టర్ తలారి రవి, చాప్టర్ వ్యవస్థాపక అధ్యక్షుడు రమాకాంత శర్మ వ్యవహరిస్తారు. పిఆర్ఎస్ఐ చైర్మన్‌గా ఎన్నికైన డాక్టర్ ప్రసాద్ ఆంధ్రా బ్యాంకులో మేనేజరుగా, బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పీఆర్వోగా సేవలందించి విఆర్ఎస్ తీసుకున్నారు. పబ్లిక్ రిలేషన్స్‌లో పిహెచ్‌డి చేసి డాక్టరేట్ అందుకున్నారు. స్విమ్స్ కమ్యూనిటి మెడిసిన్ విభాగంలో ప్రజాసంబంధాల అధికారిగా సేవలందిస్తున్న దుద్యాల చంద్రమోహన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అదేవిధంగా కోశాధికారిగా టిటిడి శ్వేతలో అతిథి ఉపన్యాసకులు కాపా మధుసూదన్, ఉపాధ్యక్షురాలిగా శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ పీఆర్వో శ్రీరజని, సహాయ కార్యదర్శిగా సంస్కార్ రాజేష్, కార్యవర్గ సభ్యులుగా శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డా. సి.స్వరాజ్యలక్ష్మి, ప్రముఖ రచయిత ఆర్సీకె రాజు, వ్యక్తిత్వ వికాస నిపుణులు వివి.సుబ్రహ్మణ్యం, సీనియర్ జర్నలిస్టు డా.పుత్తా ఎర్రంరెడ్డి ఎన్నికయ్యారు. పిఆర్ఎస్ఐ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా చైర్మన్, కార్యదర్శితోపాటు మాజీ చైర్మన్ కె.శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటి ఆఫ్ ఇండియా తిరుపతి ఛాప్టర్ గత 35 సంవత్సరాలుగా రాయలసీమలో ప్రజాసంబంధాల వ్యాప్తికి విశేష కషి చేస్తోంది. పలు సంస్థల పిఆర్వోలకు వత్తి నైపుణ్యం పెంచేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇంజినీరింగ్, ఐటి, మేనేజ్‌మెంట్ విద్యార్థులతోపాటు వివిధ సంస్థల ఉద్యోగులకు ప్రజాసంబంధాల ప్రాముఖ్యతను తెలియజేసి వారు ఉన్నతంగా ఎదిగేందుకు దోహదం చేస్తోంది. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

బిజెపి నూతన మండలాధ్యక్షుడుగా పులి సురేష్ ఎంపిక

ప్రజాశక్తి -కోట : కోట మండలంలో బిజెపి మండల అధ్యక్షులుగా పులిసురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కోట మండలంలోని తాహాసిల్దార్ కార్యాలయం ఆర్ అండ్ బి రోడ్డు సమీపంలో ఉన్న పులి సురేష్ నివాస గృహం వద్ద బిజెపి కోట మండల ఎన్నికల అధికారి డాక్టర్ బొమ్మి శ్రీహరి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ బొమ్మి శ్రీహరి, పనబాక కోటేశ్వరరావులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందుబాటులో తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం పులి సురేష్‌ను బిజెపి మండల స్థాయి ఎన్నికల అధికారి డాక్టర్ బొమ్మి శ్రీహరి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, తదితర బిజెపి నాయకులు సత్కరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బొమ్మి శ్రీహరి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, జిల్లా కోర్ కమిటీ సభ్యులు దువ్వూరు గిరిధర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పామంజి కృష్ణయ్య, మాజీ మండల అధ్యక్షులు డాక్టర్ రమేష్ బాబు, తదితర బిజెపి నాయకులు, పులి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీ కోదండ రామస్వామి కళ్యాణం

ప్రజాశక్తి-కోట: కోట మండలం, చిట్టేడు, పురాతన దేవాలయం శ్రీ సీతా సమేత కోదండరామ స్వామి వారి దేవస్థానంలో ఉత్సవాల్లో భాగంగా కోదండ రాముడి కల్యాణం ఘనంగా జరిగింది. విద్యుత్ దీపాలంకరణలతో భక్తులతో దేవాలయం రామనామ స్మరణలతో మారు మ్రోగింది.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి శశాంక్, దేవస్థాన భక్త బృందం, గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మంగళవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో సినీనటి రంభ, రైమాండ్స్ అధినేత గౌతమ్ సింఘానియా, మాజీ క్రికెటర్ రవిశాస్త్రి స్వామివారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారు వేరువేరుగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

వీర భద్రుని ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు మునిమోహన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతలుగా బెంగుళూరుకి చెందిన హెచ్.ఏ రామయ్య జ్ఞాపకార్థం, వారి కుమారులు రాఘవరెడ్డి లావణ్య, రామకృష్ణ, మయూరి, నరేందర్ రెడ్డి, సత్య, భువనేశ్వరి, చైతన్యలు వ్యవహరించారు.

దైవచింతనను పెంపొందించుకోండి

విజయేంద్ర సరస్వతికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక దైవచింతనను పెంపొందించుకోవాలని శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి కోరారు. తిరుపతి జిల్లా, రామచంద్రాపురం మండలం, కుప్పం బాదూరు సమీపంలోని ప్రాణయోగ ఆశ్రమాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. విజయేంద్ర సరస్వతికి ఆశ్రమ పీఠాధిపతి కైలాస్ గురూజీ శిష్య బృందం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆశ్రమ ప్రాంగణంలో మొక్కను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 100 మంది భక్తులు రక్తదానం చేశారు. శ్రీరామనవ సందర్భంగా ఆశ్రమంలో శ్రీ సీతా సమేత రామలక్ష్మణ, హనుమంత విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు శ్రీ విజయేంద్ర సరస్వతి ఆశీర్వాదాలు అందజేశారు. భక్తులకు ఆశ్రమ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శివ మృతికి రోజా నివాళి

నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి రోజ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణ పరిధి, ఎన్జీవో కాలనీలో నందిమంగళం గ్రామానికి చెందిన కార్యకర్త శివ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మాజీ మంత్రి రోజా మంగళవారం ఎన్జీవో కాలనీలో వారి గృహాలు వద్దకు వెళ్లి శివ కుమార్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ జయ ప్రకాష్, చైర్మన్ హరి, కౌన్సిలర్ బాలసుబ్రమణ్యం, ఏకాంబరం, చిరంజీవి, చిన్న, పుత్తూరు వైసీపీ ప్రజా ప్రతినిధులు, కన్వీనర్, నియోజకవర్గం పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

సుజాతకు పరామర్శ.. స్థానిక మున్సిపాలిటీ 23వ వార్డులో రిటైర్డ్ టీచర్ రామచంద్ర రాజు భార్య సుజాత ఇటీవల కాలంలో అనారోగ్యం పాలై హాస్పిటల్లో వైద్య చికిత్స చేయించుకొని

ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆమెను మాజి మంత్రి రోజా మంగళవారం పరామర్శించారు.ఈ కార్యక్రమంలో రోజా వెంట మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మున్సిపాలిటీ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు జయ ప్రకాష్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి సీనియర్ జర్నలిస్టులకు న్యాయం చేస్తామని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ శ్రీధర్ ఆధ్వర్యంలో మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. 1992లో ఐదు మంది సీనియర్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తూ జీవో ఇవ్వడం జరిగిందన్నారు. నేటి వరకు స్థలాలు ఇవ్వకపోవడం జర్నలిస్టులు ఎన్ని ప్రభుత్వాలు మారినా వారి దృష్టికి తీసుకొస్తున్న న్యాయం జరగలేదని, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని సీనియర్ జర్నలిస్టులు ఐదు మందికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.